**'నువ్వు దిగవలసిన రైలు కేవలం నాలుగు గంటలు లేటు' అన్న మా టి.సి. మిత్రుడి మాటలను వమ్ముచేస్తూ అయిదు గంటలు ఆలస్యంగా చేరుకుంది నారాయణాద్రి !**


# స్వప్న

-తాటిశంకర్ రావు

రైల్వేస్‌లో పని చేస్తున్నవాణ్ణి కాబట్టి వాటిని సక్ర మంగా నడవడంలో ఉన్న సాధకబాధకాలేవో నాకు తెలుసు గానీ, మిగతా ప్రయాణీకులకు ఎలా తెలుస్తుంది? జాఫర్‌షరీఫ్‌ను మొదలుకుని ఇంజన్ డ్రైవర్ వరకూ నూటొక్క భాషలో నోటికొచ్చినట్టు తిడుతూ దిగుతున్నారు అందరూ. నేను రైల్వే పక్షినని వాళ్ళకెవరికీ తెలీదు, లేకపోతే నన్ను కూడా ఉతికి ఆరేసేవాళ్ళే!

గత ఆరేళ్ళనుంచీ ఆఫీసు పనిమీద అడపాదడపా హైదరాబాదుకు వస్తూనే ఉన్నా.. ఇలా పెట్టే బేడాతో రావడం మాత్రం ఇదే ప్రథమం. అందుకే అంతా కొత్త కొత్తగా ఉంది. రైలు దిగుతుంటేనే 'ఇదే ఇక నా ఊరు!' అన్న భావం మనసులో మెదిలి నన్ను ఉక్కిరిబిక్కిరి చేసింది.

"ఏం నాయనా! నువ్వెక్కిన వేళావిశేషమా లేక మీ రైళ్ళన్నీ ఇంతేనా?" అంటూనే వీపుమీద ఒక్కటి చరిచి నా ముందుకొచ్చి నిలబడ్డాడు... సత్యం.



వాణ్ణి చూడగానే ఆనందంతో పాటు ఆశ్చర్యం కూడా కలిగింది నాకు. నాకోసం, నన్ను రిసీవ్ చేసుకోవడం కోసం అయిదు గంటలు ఓపిగ్గా ఎదురుచూస్తూ కూర్చున్న వాడి మంచితనాన్ని మనస్ఫూర్తిగా మెచ్చుకొంటూ... "సారీరా సత్యం. గుంటూరు ఇవతల గూడ్స్ బండి డిరెయిల్ అయింది. అందుకే ఈ ఆలస్యం." వీపు నిమురుకుంటూ అపాలజెటిక్‌గా అన్నాను.

"నాకు తెలుసులేరా మీ రైళ్ళ ప్రతాపం. అందుకే పొద్దున్న ఆఫీనుకెళ్ళి, హాఫ్‌డే సెలవు పెట్టి ఇందాకే వచ్చాను" అన్నాడు సత్యం. వాడికెందుకో మొదట్నుంచీ మా రైళ్ళంటేనే మంట. ఈ ప్రయాణంతోనైనా మా డిపార్టుమెంటు పట్ల వాడికున్న దురభిప్రాయాన్ని మార్చాలనుకున్నాను గానీ ఫలితం దక్కలేదు. మరోసారి ఘోరంగా విఫలమయ్యాను!

"ఇంతకూ ఇల్లు ఎలా ఉంది బాబూ? నా బడ్జెటులోనే దొరికిందా?" సామానంతా సత్యం సాయంతోనే క్రిందికి దింపి మరోసారి లెఖ్ఖ చూసుకొని అడిగాను.

వాడు నా మాటలు వినిపించుకున్నట్టు లేదు.

"ఇంతేనా?" అంటూ అడిగాడు సామాను వైపే ఆశ్చరంగా చూస్తూ.

"పొట్ట చేత బట్టుకొని ఊరూరా తిరిగేవాళ్ళం బాబూ... మా బతుక్కి ఇదే ఎక్కువ" అన్నాను నవ్వుతూ.

"ఏడిశావ్ గానీ ఇంతకూ చెల్లాయేదిరా? రాలేదా?" మరింత ఆశ్చర్యంగా అడిగాడు సత్యం.

"లేదురా. నిన్ననే వాళ్ళ నాన్నగారొచ్చి అటునుంచటే వాళ్ళ ఊరికి తీసికెళ్ళారు. మరో నాలుగు నెల్లవరకూ రాదు. మనం కాదంటే మాత్రం వింటారా ఈ నారీమణులు! అందుకే సరేనన్నాను" అని నవ్వి... "అఫ్‌కోర్స్! వచ్చేటప్పుడు ఓ వంశోద్ధారకుణ్ణి కూడా వెంటబెట్టుకొస్తాననుకో..." నా మాటలింకా పూర్తికానే లేదు.

"రాస్కెల్! రైల్వే బుద్ధులు పోనిచ్చుకున్నావ్ కాదు! ఈ గుడ్ న్యూస్ చెప్పడానికి కూడా ఇంత ఆలస్యం చేస్తావా? నిన్ను ఎంతమాత్రం క్షమించడానికి వీల్లేదు." మరింత జోరుగా నా వీపుమీద చరుస్తూ కోపంగా అన్నాడు సత్యం. ఈసారి నిజంగానే నా వీపు చిట్లిపోయినట్టయింది.

ఇక అక్కడ నిలబడి వాడితో ఆర్గ్యూ చెయ్యడం క్షేమం కాదనుకుని, ఇందాకట్నుంచీ మావైపే ఆశగా చూస్తున్న కూలీని పిలిచి... రెండు సూట్‌కేసులూ, హోల్డాల్ నెత్తికెక్కించి, మరో రెండు ఎయిర్ బ్యాగ్‌లను అతని భుజానికి తగిలించి... "పదరా" అన్నాను సత్యంతో.

వాడికింకా నామీద కోపం తగ్గినట్టు లేదు.

మా ఆవిడను ప్రసన్నం చేసుకోవడం కంటే వాడిని ప్రసన్నం చేసుకోవడం చాలా కష్టమని అనుభవపూర్వకంగా తెలిసినవాణ్ణి కాబట్టి... వాడి భుజం మట్టూ చెయ్యి వేసి...

"ఇలాంటి సెన్సేషనల్ న్యూస్‌ను ముప్పావలా ఇన్‌ల్యాండ్ లెటర్‌లో రాస్తే ఏం బావుంటుందిరా సత్యం? పర్సనల్‌గా వచ్చి చెప్పి, ఆశ్చర్యపరిచి, బ్రహ్మాండమైన పార్టీ ఇచ్చి సెలబ్రేట్ చేసుకుంటే థ్రిల్లింగ్‌గా ఉంటుంది గానీ, 'నేను నాన్నను కాబోతున్నానం'టూ రెండు ముక్కల్లో తేల్చేస్తే ఏం మజా ఉంటుంది చెప్పు" అంటూ కన్విన్సింగ్‌గా మాట్లాడుతూనే ముందుకు నడిపించాను వాణ్ణి.

"చేసేదంతా చేసి చివరికి జస్టిపై చేసుకోవడంలో ఉద్దండులురా మీ రైల్వే వాళ్ళు" అన్నాడు నిష్ఠూరంగా.

నేను రైల్వేస్‌లో జాయిన్ అయిన నాటినుంచీ గమనిస్తూనే ఉన్నాను. రైల్వే డిపార్టుమెంటు మీద వాడికున్న అక్కసునంతా నామీదే వెళ్ళగక్కుతూ ఉంటాడు వాడు.

"సర్లే, మా రైల్వే డిపార్టుమెంటునూ రేపట్నుంచి తీరిగ్గా ఏకిపారేద్దువు గానీ ముందు మనం ఎక్కడికెళ్ళాలో చెప్పు" అన్నాను కూలీ చేతిలో పది రూపాయల కాగితం పెడుతూ. అప్పటికే అతను తిన్నగా వెళ్ళి తనకు తెలిసిన డ్రైవర్ తాలూకు ఆటోలో సామానంతా సర్దేశాడు.

"బంజారాహిల్స్" అంటూవెళ్ళి ఆటోలో కూర్చున్నాడు సత్యం.

అంతే!

గుండె ఆగినంత పనయ్యింది నాకు.

"బంజారాహిల్స్‌కు ఎందుకురా? రెడ్‌హిల్స్‌లో చూశానన్నావుగా?" వాడిపక్కనే కూర్చుంటూ భయం భయంగా అడిగాను.

"ముందు రెడ్‌హిల్స్‌లోనే చూశా(నా). రెండ్రోజుల క్రితమే వాళ్ళ అబ్బాయి దుబాయ్ నుంచి వచ్చేస్తున్నట్టు ఫోన్ చేసి చెప్పాడట. ఇవ్వనన్నాడు" అన్నాడు సత్యం కూల్‌గా!

"రెడ్‌హిల్స్‌లో దొరక్కపోతే ఏ బజార్‌ఘాట్‌లోనో, మల్లేపల్లిలోనో చూడక ఏకంగా బంజారాహిల్స్‌కు ఎందుకెళ్ళావ్‌రా? మా రైల్వే వాళ్ళ జీతాలు మీకంటే ఘనంగా ఉంటాయనుకుంటున్నావా?" ఏడుపు గొంతుతో అడిగాను సత్యాన్ని.

డ్రైవర్ వెనక్కి తిరిగి నావైపే చూస్తున్నాడు విసుగ్గా! దూరం ఎక్కువ కాబట్టి, అతనికి కూడా బంజారాహిల్స్‌కు వెళ్ళడమే ఇష్టం లాగుంది.

"బంజారాహిల్స్‌లో ఉండే అవకాశం దొరికినందుకు సంతోషించక ఈ ఏడుపు మొహమేమిట్రా బొగ్గింజన్‌లా" అంటూ నన్ను కసురుకుని... "బంజారాహిల్స్‌కు పద" అన్నాడు ఆటో డ్రైవర్‌తో.

దాంతో అతను ఎగిరి గంతేసినంత పనిచేసి 'సారూ ఫ్యేహెూత' అన్నాడు సీరియస్‌గా.

'ఇది కూడా అదృష్టమే కదూ' అన్నట్టు కోపంగా చూశాను సత్యాన్ని.

వాడికి అరికాలి మంట నెత్తికెక్కినట్టుంది. డ్రైవర్‌ను నమిలి మింగేలా చూస్తూ... క్యా బోల్తే మియ్యా'. బంజారాహిల్స్‌కు సారూఫ్యేహెూతా? క్యా ఓ బంగాళాఖాతమ్‌మే హై సమఝే' మీటర్ డాల్కే సీదా చలో... నైతో పోలీస్ స్టేషన్‌కు లేజావుంగా..." గొంతు చించుకుని అరిచాడు... సత్యం.

డ్రైవర్ ఖంగుతిన్నాడు. అదీగాక అక్కడే డ్యూటీలో ఉన్న ట్రాఫిక్ పోలీసు కూడా మావైపే వస్తూ కనిపించడంతో కాళ్ళబేరానికొచ్చాడు.

"ఠీక్ హైసాబ్ మీటర్‌పే హీ చలేంగే మగర్ ఎక్ పాంచ్ రూప్యే జ్యాదా దిలావీజియే..." అంటూ బ్రతిమాలుతూనే ఆటో స్టార్ట్‌చేసి జెట్ ఫైటర్‌లా ముందుకు దూకించాడు.

మావాడికి ఆ ప్రపోజల్ కూడా నచ్చులేదు కానీ... "పోనీలేరా... అయిదు రూపాయలేగా?" అని నేను సర్దిచెప్పడంతో సరేనన్నాడు.

"ఇంతకూ అద్దె సంగతి చెప్పనేలేదురా నువ్వు... ఎన్ని వేలకు మాట్లాడావ్?" దార్లో అడిగాను...

> **అందుకు!**
>
> **పిల్ల రంభ. ఎందుకు చేసుకోనంటావు?**
> **"ఇంద్రుడొచ్చి పట్టుకెళ్ళిపోతాడేమోనని"**
>
> **వి.మంజురాణి [హన్మకొండ]**

"అయిదు. ఫరవాలేదా?" నవ్వుతూ అన్నాడు సత్యం.

"అంటే నెలకు రెండు వేలు అప్పుచేసి అద్దె కట్టాలన్న మాట! అసలు ఇల్లు చూడమని నీలాంటి వాడికి చెప్పడం నాదే బుద్ధి తక్కువ" నిటారుగా నిలబడ్డ బుద్ధ విగ్రహంవైపే చూస్తూ అన్నాను నేను.

"ఆ విషయం ఇల్లు చూసిన తరవాత కన్‌ఫర్మ్ చేసుకోరా? ఎందుకంత తొందర?" అన్నాడు వాడు టీజింగ్‌గా.

నేను మాట్లాడలేదు. అయిదు వేలకు కాకపోయినా కనీసం వెయ్యి రూపాయలకైనా మాట్లాడి ఉంటాడు. నెలకు వెయ్యేసి చొప్పున ఇంటి అద్దెకే పోతే ఈ మహాపట్టణంలో బ్రతికేదెలా? డబ్బు విలువ తెలియని సత్యానికి ఇల్లు చూడమని చెప్పి నిజంగా పొరపాటు చేశాననిపించింది. ఏదో విధంగా రెండు మూడు నెల్లు అక్కడే కాలం గడిపి... ఆ తరవాత నా ఆదాయానికి తగ్గ ఇల్లు నేనే వెతుక్కోవాలి...? అని అప్పటికప్పుడే నిర్ణయించుకున్నాను.

ఆటో వాయు వేగంతో పోటీ పడుతూ ముందుకు దూసుకుపోతోంది. కన్ను మూసి తెరిచేంతలోనే ట్యాంక్ బండ్, సెక్రెటేరియట్, లకిడీ-కా-పూల్ వరుసగా ఒక్కొక్కటే వెనక్కి పోతున్నాయ్.

మరో పది నిముషాలు ఏకబిగిన ముందుకు పరిగెత్తి బంజారాహిల్స్‌లోకి ప్రవేశించిన ఆటో ఓ అధునాతనమైన భవనం ముందాగింది.

"ఇదేరా నీ స్వీట్ హెూమ్" అంటూ కిందికి దిగాడు సత్యం.

నాకు నిజంగానే మతిపోయినట్టయింది. అంత పెద్ద ఇంట్లో ఎంత చిన్న పోర్షన్‌కైనా రెండు వేలకు తక్కువ వసూలు చెయ్యరు ఎవ్వరూ? వీడు ఎంతకు మాట్లాడాడో? నన్నెంత లోతుకు ఇరికించాడో?

"ఏరా నచ్చలేదా?" సత్యం పిలుపుతో స్పృహలోకి వచ్చాను నేను. అప్పటికే ఆ ఇంటి పని కుర్రాడు కాబోలు. వచ్చి సత్యానికి నమస్కారం చేసి సామానంతా ఆటోలోంచి దింపుతున్నాడు.

"నచ్చకపోవడమేమిటి? బ్రహ్మాండంగా ఉంటేనూ" ఏడవలేక నవ్వుతూ మీటర్ చూసి మరో అయిదు రూపాయలు కలిపి డ్రైవర్‌కు ఇచ్చి పంపించేశాను.

"పై పోర్షన్‌లోకి వస్తున్నది ఈసారేనా సార్?" నావైపు చూసి పలకరింపుగా నవ్వుతూ సత్యాన్ని అడిగాడు ఆ కుర్రాడు.

"అవునయ్య లింగం సార్‌ను నువ్వు కాస్త జాగ్రత్తగా చూసుకోవాలి. మరో మూడు నాలుగు నెల్ల వరకూ మా చెల్లాయ్ కూడా ఉండదిక్కడ..."

"ఆమాట మీరు చెప్పాలా సార్? ఇల్లు తుడవడం దగ్గర్నుంచి బట్టలుతకడం వరకూ... ఏ టూ జెడ్ అన్ని పనులూ నేనే చేస్తాను సార్... వంట చెయ్యడం కూడా ఇప్పుడిప్పుడే నేర్చుకొంటున్నాను సార్... ఫరవాలేదంటే చేసి పెడతాను..." అన్నాడు అతను హుషారుగా.

"అబ్బెబ్బె... వంటాగింటా అఖ్ఖర్లేదుగానీ మిగతా పనులు చేసిపెట్టు చాలు". అన్నాను నేను కంగారుగా...

అతను కాస్త డిజప్పాయింట్ అయినట్టున్నాడు. "అలాగే సార్..." అన్నాడు నెమ్మదిగా...

"పదరా సామానంతా మన లింగం పట్టుకొస్తాడులే..." అంటూ గేటు తీసుకుని ముందుకు కదిలాడు సత్యం. నేను మౌనంగా అనుసరించాను వాణ్ణి.

విశాలమైన ఆవరణలో ఆర్కిటెక్చరల్ వాల్యూస్‌తో కట్టించిన స్పేషియస్ బిల్డింగ్ అది. ఇంటి చుట్టూ ఉన్న రక రకాల పూల మొక్కలు ఆ ఇంటికి మరింత అందాన్ని సమకూర్చిపెడుతున్నాయి.

సత్యం వెనకే తిన్నగా ఇంటి వెనకవైపునకు నడిచాను. స్టెయిర్‌కేస్ అక్కడే ఉంది.

"ఉండేది ఇద్దరే అయినా క్రింది పోర్షన్ అంతా వాళ్లే వాడుకుంటారు. పైనున్న చిన్న పోర్షనే మనది. అసలు అది కూడా అద్దెకిచ్చే ఆలోచన లేదు వాళ్ళకు... అవసరం అంతకన్నా లేదు! కేవలం నా మాట మీదున్న గౌరవం కొద్దీ ఇచ్చారు. అన్నట్టు అతనిపేరు నీకు చెప్పలేదు కదూ? సురేష్‌చంద్ర అని నా కొలీగ్. చాలా రిచ్ ఫెల్లోలే? మెట్లెక్కుతూనే చెప్పుకుపోతున్నాడు సత్యం. నేను మౌనంగా వింటూ అనుసరిస్తున్నాను.

ఎందుకో ఆ ఇంట్లో ఉండలేనని అనిపిస్తోంది నాకు. అది ఆత్మన్యూనతా భావమో, లేక ఇలాంటి రిచ్ సర్కిల్స్‌లో ఇమడలేనన్న భయమో ఇదమిత్థంగా తెలియడంలేదు గానీ చాలా అనీజీగా ఫీలౌతున్నాను నేను. నా దృష్టిలో సత్యమే రిచ్ ఫెల్లో! అలాంటి సత్యమే 'చాలా రిచ్ ఫెల్లో' అంటూ ఇంటి యజమానిని సర్టిఫై చెయ్యడం వల్ల మరింత ఇబ్బందిగా ఫీలవ్వసాగాను నేను.

లింగం మా వెనకాలే వచ్చి సూట్‌కేసులు పక్కన పెడుతూ తలుపు తెరిచాడు.

చిన్న పోర్షనే అయినా, అన్ని సదుపాయాలతో ఎంతో సౌకర్యంగా ఉంది ఇల్లు. చిన్న డ్రాయింగ్ రూమ్, డ్రాయింగ్ రూమ్ పక్కనే అటాచ్డ్ బాత్‌రూమ్‌లో ఓ మోస్తరు బెడ్‌రూమ్, డ్రాయింగ్ రూమ్ వెనకే డైనింగ్ హాల్ దానిని ఆనుకుని కిచెన్... నాలాంటి మధ్యతరగతి కుటుంబీకుల కోసమే ప్రత్యేకంగా డిజైన్ చేసి కట్టించినట్టుందది.

"ఎలా ఉందిరా పోర్షన్?" నావైపే పరీక్షగా చూస్తూ అడిగాడు సత్యం. అప్పటికే నా లగేజీ అంతా లోపలికి చేరవేశాడు లింగం.

"చాలా బావుంది కానీ..." అన్నాను నీళ్ళు నములుతూ. ఇల్లూ, వాడా పోష్‌గానే ఉన్నా ఆ పోర్షన్ మాత్రం మామూలుగానే ఉంది. అందుకేనేమో నాక్కూడా బాగా నచ్చింది. కాకపోతే అక్కడున్న రెంటల్ వాల్యూకు ఆ **పోర్షన్‌కు వెయ్యి రూపాయలన్నా తక్కువే?**

"నీ ఏడుపంతా రెంట్ గురించేగా? చెబుతున్నాను గానీ కాస్త జాగ్రత్తగా విను" అని ఓ క్షణమాగి... "నెలకు అయిదు వందలు. కరెంటు ఛార్జీలు, వాటర్ ఛార్జీలు అంటూ సన్నాయినొక్కులు కూడాలేవు. క్రింద ఇల్లుగల వాళ్ళు, పైన మీరు...అంతే? ఎక్కువ జనాభా కూడా లేదు. నచ్చినట్టేనా?"

ఆశ్చర్యంతో నోట మాటరాలేదు నాకు. బంజారాహిల్స్ లాంటి ఏరియాలో అయిదు వందలకు అంత మంచి పోర్షన్ దొరుకుతుందంటే నిజంగా నమ్మబుద్ధి కాలేదు

[illegible] నా ముఖంలో కదలాడుతున్న భావాలను కనిపెట్టి [illegible]న్నాడు.

"చెప్పానుగా... అసలీ పోర్షన్‌ను కూడా అద్దెకిచ్చే ఉద్దేశం లేదు సురేష్‌కు. రెడ్‌హిల్స్‌లో నీకు చూసిన ఇల్లు లాస్ట్ మినిట్‌లో కేన్సిల్ అయ్యే సరికి... అతనికి నేనే ప్రపోజ్ చేశాను. మొహమాటంగానే ఒప్పుకున్నాను. కానీ అద్దె మాత్రం వద్దన్నారు... 'మా వాడికి మనందరి కంటే ఎక్కువ ఆత్మాభిమానమండీ బాబూ... ఫ్రీగా ఇస్తే ఒప్పుకోడ'ని బలవంతం చేస్తే అదేదో నన్నే ఫిక్స్ చెయ్యమన్నారు. నీ కెపాసిటి నాకు తెలుసు కాబట్టి అయిదొందలు ఇస్తాడన్నాను. వాళ్ళూ సరేనన్నారు. ఇక ఇప్పుడు చెప్పు... నీకూ ఓకేనేనా?"

"థాంక్స్‌రా సత్యం. నీ ఋణం ఈ జన్మలో తీర్చుకోలేను..." అన్నాను సంభ్రమంగా...

"ఈ జన్మలో కాదు... ఇప్పుడే తీర్చుకుంటున్నావు గానీ ముందు వెళ్ళి స్నానం చెయ్యి...ఆ తరువాత అలా బయటికి వెళ్ళి ఓ మాంచి హోటల్లో చెత్త భోజనమూ, చెత్త హాల్లో మాంచి సినిమాచూసి మా ఇంటికి వెళదాం... రేపు శనివారమే కాబట్టి తీరిగ్గా వచ్చి ఇల్లు సర్దుకోవచ్చు..." అన్నాడు సత్యం...

"అలాగే" అంటూ బాత్రూమ్‌లోకి నడిచి.... పావు గంటలో స్నానాదికాలు ముగించి సత్యంతో కలిసి బయటపడ్డాను.

అశోకాలో భోజనం చేసి, అమరావతిలో ఇంగ్లీషు సినిమా చూసి... లకిడీకాపూల్‌లో కాస్సేపు పచార్లు కొట్టి... అందమైన అమ్మాయిలను ఆరాధనగానూ, ఓ మోస్తరుగా ఉన్న వాళ్లను ఆప్యాయంగా, పరమ దరిద్రంగా ఉన్నవాళ్లను జాలిగాను చూసి... కాలేజీ రోజులను జ్ఞాపకం చేసుకుని నవ్వుతూ, తుళ్ళుతూ రాత్రి ఎనిమిదింటి వరకూ రోడ్ల మీదే తిరిగి లక్కీ రెస్టారెంటులో కేక్‌పేస్ట్రీలు ల్యాంచి... ఆనాటి కార్యక్రమాలకు చుక్క పెట్టాము.

'మా ఇంటికే రావాలంటూ' భీష్మించుకు కూర్చున్న సత్యాన్ని బ్రతిమాలి బామాలి అతికష్టం మీద ఒప్పించి... వాణ్ణి వాళ్ల ఇంటికి పంపించి నేను నా కొత్త ఇంటికి బయల్దేరాను.

ఇల్లంతా విద్యుద్దీపాలతో దేదీప్యమానంగా వెలుగుతోంది. మధ్యాహ్నం చూసిన దానికంటే ఇప్పుడు మరింత అందంగా, ఆకర్షణీయంగా, రిచ్‌గా ఉందది. వాళ్లను ఆ రాత్రి పలుకరించి డిస్టర్బ్ చెయ్యడం ఇష్టంలేక తిన్నగా నా పోర్షన్ వైపు నడిచాను.

నేను రావడంలింగం గమనించినట్టున్నాడు... నా వెనకాలే పైకి వచ్చాడు...

"అమ్మగారు కూడా ఇంతకు ముందే వచ్చారు సార్...మీరొచ్చివెళ్ళినట్టు చెప్పాను... రాగానే కలవమన్నారు..." అన్నాడు. లింగం.

"తిరిగి తిరిగి బాగా అలసిపోయాను లింగం. రేపు పొద్దున్నే వచ్చి కనబడతానని చెప్పు... అన్నట్టు మీ అన్నయ్యగారింకా రాలేదా?" హోల్డాల్ తెచ్చి కింద పరచుకుని నడుం వాలుస్తూ అన్నాను. బట్టలు మార్చుకునే ఓపిక కూడా లేదునాకు?

"లేరు సార్... క్యాంప్ కెళ్ళారు. సత్యంసార్ చెప్పలేదా?" అడిగాడు లింగం...

చెప్పలేదన్నట్టు తలూపి కళ్ళు మూసుకున్నాను అలసటగా...

"భోం చేశారా సార్? లేకపోతే అమ్మగారిని అడిగి ఏమైనా పట్టుకురమ్మంటారా?"

**పాట**

**"నా మనసు సన్నాయి పాడుతున్నది."**
**"బాబూ! రేపు మా ఇంట్లో శుభకార్యం. ఓ సారి రా"**

**వి.మంజులారాణి [హన్మకొండ]**

"వొద్దొద్దు. భోంచేసే వచ్చాను. అన్నాను కంగారుగా. అతని వాలకం చూస్తుంటే ఇప్పుడిప్పుడే నన్ను వొదిలిపెట్టేట్టు లేడు.

"టీ, కాఫీ ఏమైనా తెచ్చివ్వమంటారా సార్? డౌన్లో చిన్న కాకా హోటల్ ఉంది. రాత్రి, పది, పదకొండు వరకూ టీ అమ్ముతాడు అతను..." కాస్సేపాగి మళ్ళీ అడిగాడు లింగం...

వద్దన్నట్టు తలూపాను.

"అమ్మగారేప్పుడొస్తారు సార్?"

"మూణ్ణాలుగు నెల్లు పడుతుంది. విసుగునూ, కోపాన్నీ బలవంతంగా అణుచుకుంటూ సాధ్యమైనంత నెమ్మదిగా చెప్పాను.

"పోనీ అప్పటి వరకైనా వంట చేసి పెడతాను సార్... మీరేమీ డబ్బులివ్వనక్కర్లేదు. ఫ్రీగానే చేస్తాను సార్..." అంటున్న లింగంను ఆశ్చర్యంగా చూశాను.

"అవున్సార్... బాగా వంట నేర్చుకుని ఓ పెద్ద ఫైవ్‌స్టార్ హోటల్లో ఛీఫ్‌కుక్‌ను అవ్వాలని ఉందిసార్... కొంత వరకు నేర్చుకున్నాను కూడా? కానీ రోజూ చెయ్యకపోతే మరచిపోతాం కదాసార్? మా అమ్మగారికేమో నా వంట మీద నమ్మకం లేదు. ఏ పనైనా చెయ్యనిస్తుంది కానీ కిచెన్‌లోకి మాత్రం రానివ్వదు..."

లింగంను చూస్తుంటే జాలేసింది నాకు. అతని అమాయకత్వానికి నవ్వు కూడా వచ్చింది.

"సర్లే... అలాగే చేద్దువుగానీ... ఇక వెళ్ళి పడుకో... నాకు బాగా నిద్రొస్తుంది..." అన్నాను నవ్వుతూ...

వాడి మొహం నియాన్ ల్యాంప్‌లా వెలిగిపోయింది... "థ్యాంక్ యూ సార్" అంటూ తుర్రుమన్నాడు... వాడు మళ్ళీ వచ్చి ఎక్కడ బాతాఖానీ పెడతాడోనన్న భయంకొద్దీ వెంటనే లేచి తలుపులు వేసి బట్టలు మార్చుకుని పడుకున్నాను.

రాత్రంతా ప్రయాణం చెయ్యడంతో బాటు... పగలంతా సత్యంగాడితో ఊరి మీద పడి బలాదూరు తిరగడం వల్ల బాగా అలసిపోయాను. ఎప్పుడు ఎలా నిద్ర పట్టిందో కూడా తెలీదు.

కాలింగ్ బెల్లు అదే పనిగా మోగుతుంటే మెలకువ వచ్చి లేచి తలుపు తెరిచాను...

ఎదురుగా లింగం..

"ఏమిటి సార్... ఇంత పొద్దుపోయే వరకూ పడుకున్నారు ?.. అమ్మగారు కాఫీ పంపించారు గానీ త్వరగా మొహం కడుక్కుని రండి.." అంటూ ఫ్లాస్కుతో లోపలికి ప్రవేశించాడు.

ఇంకాస్సేపు పడుకోవాలనే ఉన్నా... లింగం వదిలేట్టు లేడని గ్రహించి బద్ధకంగా వెళ్ళి మొహం కడుక్కుని కాఫీ తాగాను...

వెళుతూ వెళుతూ... "టిఫినూ, భోజనం కూడా పంపిస్తానన్నారు సార్ మా అమ్మగారు. రాత్రి నుంచి వంట మొదలెడతాను..." అన్నాడు లింగం.. వద్దని వారిస్తున్నా వినిపించుకోకుండా వెళ్ళిపోయాడు!..

గబగబా లేచి స్నానం చేసి రెడీ అయిపోయి తలుపుకు తాళం వేసి క్రిందికి దిగాను...

ఆవిడ కొకసారి కనిపించి, 'నా కోసం అనవసరంగా శ్రమ తీసుకోవద్దని' నచ్చ చెప్పాలనుకునివాళింట్లోకి నడిచాను..

"రండి సార్... అమ్మగారు ఇందాకే టిఫిన్ ఇచ్చి రమ్మన్నారు.. ఈలోగా మీరే వచ్చారు..." అంటూ గుమ్మంలోనే ఎదురై ఆహ్వానించాడు లింగం.

"నాకిప్పుడు టిఫిన్ చేసేంత టైమ్ లేదుగానీ... ఓసారి మీ అమ్మగారిని పిలుస్తావా ?" అన్నాను వాడికి మాత్రమే వినిపించేలా.

వాడే లోకంలో ఉన్నాడో గానీ 'అలాగే' నంటూ తలూపి లోపలికి పరుగెత్తాడు.

"అదేమిటండీ... టిఫిన్ చెయ్యకుండానే వెళ్ళిపోతానన్నారుట ? అదెలా కుదురుతుంది..." అంటూ హాల్లోకి ప్రవేశించిన ఆమెను చూసి నిశ్చేష్టుణ్ణయ్యాను. నోట మాట రానట్టు మూగవాడిలా చూస్తూ నిలబడిపోయాను...

ఆమె ఎవరో కాదు... స్వప్న!

సుమారు నాలుగేళ్ళ క్రితం కనబడి ఓ మధురస్వప్నంలా మిగిలిపోయిన స్వప్న! పీటల వరకూ వచ్చిన పెళ్ళిని కాదని, కాళ్ళావేళ్ళా పడి బ్రతిమాలుతున్న వృద్ధ దంపతులను కాలదన్ని 'మాకు మీ సంబంధం అక్కర్లేదంటూ' నిర్దయగా, నిర్లజ్జగా తెగతెంపులు చేసుకుని వచ్చిన పెళ్ళికొడుకును నేను...! పెళ్ళికూతురి కళ్ళల్లో సుళ్ళు తిరుగుతున్న కన్నీళ్ళనుగానీ.. అదురుతున్న పెదాలు విన్నవించుకుంటున్న అభ్యర్థనను గానీ లెఖ్ఖచెయ్యక వెనుతిరిగిన కసాయివాణ్ణి నేను !!

"మీరా ? నేనింకా ఎవరో అనుకుంటున్నాను..." ఇరువురి నడుమా పేరుకుపోతున్న నిశ్శబ్దాన్ని పటాపంచలు చేస్తూ స్వప్న ముందు పలుకరించింది.

దురదృష్టవశాత్తూ ఆమె నన్నింకా మరిచిపోలేదు.

"సారీ..." ఆ రెండక్షరాలు ఉచ్చరించడానికి కూడా గొంతు సహకరించడం లేదు నాకు.

"సారీ ఎందుకు ? నేనే మీకు థ్యాంక్స్ చెప్పాలి" స్వప్న మాటలు ఈటెల్లా వచ్చి నా హృదయాన్ని ఛిద్రం చేశాయి.

అవును.. ఆమెను క్షమించమని అడగడానికి కూడా అర్హత లేని వాణ్ణినేను !

"అరెరె... శ్రీరామ్‌గారూ.. అలా వెళ్ళిపోతున్నారేమిటి ? టిఫిన్ చేసి వెళ్ళండి" స్వప్న మాటలు నా చెవిని సోకుతూనే ఉన్నా... కాళ్ళు మాత్రం వేగంగా ముందుకు కదులుతున్నాయ్...

ఒక మూర్ఖుడి మాటలు విని కట్టుకున్న భార్యనే అడవులకు పంపిన శ్రీరామచంద్రుణ్ణి కాదు నేను! పెళ్ళికి ముందే ఎవడో వాగిన విషయాన్ని నమ్మి రాముణ్ణి అయ్యే అవకాశాన్ని చేజేతులా వదులుకున్న మూర్ఖుణ్ణి నేను !!

"సత్యం.. నేనా స్వర్గంలో ఇమడలేను. మరోచోట ఎక్కడైనా చూసిపెట్టు. అంతవరకూ ఇక్కడే మీ ఇంట్లోనే ఉంటాను.." అంటున్న నావైపు ఓ వెర్రివాణ్ణి చూసినట్టు చూశాడు సత్యం. వాడి భార్యకు కూడా నా ప్రవర్తన వింతగా తోచింది కాబోలు.. కాఫీ కప్పులతో ప్రవేశించినదల్లా అలాగే నిలబడి పోయింది.